ఆశలు ఆవిరి

ఈ ఏడాది రైతన్నకు వ్యవసాయం కలిసిరాలేదు. ఖరీఫ్‌లో ముందుగా తీవ్ర వర్షాభావం, ఆ తరువాత భారీ వర్షాలు, వెంటనే తెగుళ్లు ఇలా అన్నదాతను ప్రకృతి వెంటాడింది. ప్రభుత్వ సాయం లేకున్నా అష్టకష్టాలకోర్చి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాలేదు. అయినా రబీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామని ముందుగా కురిసిన వర్షాలకు అధిక శాతం పప్పు శనగ పంట సాగు చేశారు. ఆ తరువాత చినుకు రాలకపోవడంతో వర్షాభావం కారణంగా పైరు ఎదుగుదల లోపించింది. దీనికి తోడు తెగుళ్లు వెంటాడటం.. కళ్లెదుటే పంట ఎండి పోతుండటంతో అన్నదాత కళ్లు చెమర్చుతున్నాయి.

- వర్షాభావంతో ఎదుగుదల లేని శనగ పైరు
- వెంటాడుతున్న తెగుళ్లు
- ఎండుతున్న పంట
- పెట్టుబడి కూడా వచ్చేలా లేదంటున్న రైతులు
- ఇప్పటికే ఖరీఫ్‌లో భారీగా నష్టాలు


జొహరాపురం సమీపంలో ఎండు తెగులు సోకిన పప్పు శనగ


ఆస్పరి సమీపంలో ఎదుగుదల లేని శనగ పైరు

ఆస్పరి: పప్పు శనగ రైతులు ఏటా ఏదో ఒక రూపంలో నష్టపోతూనే ఉన్నారు. గత ఏడాది వర్షాభావంతో మండలంలో 4,694 హెక్టార్లలో పంట దెబ్బతిని పెట్టుబడి కూడా చేతికి రాలేదు. ఈ సారి 2,756 హెక్టార్లలో విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు లేక పైరు ఎదుగుదల లోపించింది.అలాగే పంటకు ఎండు తెగులు సోకి పూర్తిగా దెబ్బతింది. వరుసుగా రెండేళ్లు రైతున్నకు దెబ్బమీద దెబ్బ తగలడతో కోలుకోలేని పరిస్థితి. వ్యసాయం అంటే భయపడే పరిస్థి తులు నెలకొన్నాయని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినుకు రాలక.. తెగుళ్లు..

అరకొరగా కురిసిన వర్షాలకు 50 రోజులు క్రితం శనగ విత్తనం వేశారు. విత్తనం వేసిన రోజు నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో భూమిలో తేమ లేక పైరు ఎదుగుదల ఆగిపోయింది. పైగా ఎండు తెగులు సోకి పైరు ఎండి పోయింది. పంట సాగుకు ఎకరాకు రూ. 15వేలు, కౌలు రైతులైతే ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని అవేదన చెందుతున్నారు. మండలంలోని నల్లరేగడి భూములున్న ఆస్పరి, చిన్నహోతూరు, జొహరాపురం, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, బిణిగేరి, చిగిళి, నగరూరు, కారుమంచి, కైరుప్పల గ్రామాల పరిధిలో రబీ సీజన్‌లో 2,756 హెక్టార్లలో పంట సాగు చేశారు. వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపి ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.90 రోజుల పంట కాలం ఉన్న ఈ పంట కోతలు వచ్చే నెల చివరి నుంచి ప్రారంభమవుతాయని, ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా శనగల ధర రూ.6,100 పలుకుతోందని, ఈ లెక్కన రెండు క్వింటాళ్లకు రూ.14వేలు వచ్చినా పెట్టుబడి కూడా లభించదు.

పంట పూర్తిగా దెబ్బతినింది



విత్తనం వేసిన తరువాత వర్షాలు రాకపోవడంతో పప్పు శనగ పంట పూర్తిగా దెబ్బతినింది. ఎకరాకు రూ.15వేలు పెట్టుబడితో 20 ఎకరాలు సాగు చేశా. పైరు ఎదుగుదల లేకపోవడమే కాకుండా ఎండు తెగులు సోకి పంట పూర్తిగా ఎండిపోయింది. పొలంలో పైరు చూస్తే పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు. పంట కోతకు కూలీల ఖర్చు చేతి నుంచి వేసుకోవాల్సిందే.

– లాలప్ప,రైతు, జొహరాపురం

ఎకరాకు రెండు క్వింటాళ్లు కూడా రావు



ఈసారి ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదు. 10 ఎకరాల్లో శనగ సాగు చేశా. ప్రతి ఏడాది ఏదో ఒక విధంగా నష్టపోతూనే ఉన్నాం. గత ఏడాది కూడా వర్షాభావం దెబ్బతీసింది. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినా నేటికీ ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇవ్వలేదు.

– కాశింరెడ్డి, రైతు, శంకరబండ

ప్రభుత్వం ఆదుకోవాలి



పప్పు శనగ దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకో వాలి. 6 ఎకరాల్లో రూ. 90వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశా. ప్రస్తుతం తెగుళ్లతో పైరు ఎండిపోయింది. పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పంట దెబ్బతిన్న వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. ఏటా నష్టాలు వస్తున్నందున సాగు చేయాలన్న ఆసక్తి సన్నగిల్లుతోంది.

– లక్ష్మన్న, రైతు, జొహరాపురం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వర్షాలు లేక పైరు పెరగలేదనేది వాస్తవమే. పప్పు శనగకు ఎండు తెగులు సోకింది. దీని నివారణకు రైతులు ఎకరాకు 3 కేజీల ట్రికో డెర్మి విరిడిలో 20 కేజీలు పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టును కలిపి మొక్కల దగ్గర చల్లాలి. మళ్లీ 4 రోజులకు ఇంకోసారి అదే విధంగా చల్లుకోవాలి. రైతులు విత్తన శుద్ధి చేసుకోకపోవడం , పంట మార్పిడి చేయకపోవడం వల్ల కూడా తెగుళ్లు చుట్టుముట్టే అవకాశం ఉంది.

– నరేంద్రకుమార్, ఏఓ, ఆస్పరి మండలం

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మ వార్లుకు కుంకుమార్చన, హోమాలు, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

సీసీ రోడ్లు ప్రారంభం

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు శుక్రవారం పర్యటించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నలకదొడ్డిలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, రూ.4 లక్షలతో నిర్మించిన గోకులషెడ్లు, పగిడిరాయిలో రూ.9 లక్షలతో వేసిన సీసీరోడ్డు, రూ.2.30 లక్షలతో ఏర్పాటు చేసిన గోకుల షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సువర్ణలత, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎం బాషా, పీఆర్ డీఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం


వరిగడ్డి ట్రాలీ కాలిపోతున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో పొలం నుంచి ఇంటికి పశుగ్రాసాన్ని శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వరిగడ్డి మొత్తం కాలిపోయింది. దీంతో వరిగడ్డిని ఆర్పేందుకు స్థానిక ప్రజలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ట్రాక్టర్ వరిగడ్డి కాలిబూడిదైంది. అలాగే ట్రాక్టర్ ట్రాలీ పాక్షికంగా దెబ్బతినింది.

టెంకాయల విక్రయానికి వేలం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి నాలయంలో టెంకాయలు, తమలపాకులు అమ్ముకునేందుకు శుక్రవారం వేలాలు నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు. ఆలయం ఆవరణలో పర్యవేక్షణాధికారిగా వెంకటరమణయ్య ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించగా రూ.8.25 లక్షలకు బాల్యం రవి దక్కించుకున్నారని చెప్పారు.

పంట మార్పిడితోనే తెగుళ్ల నివారణ


తెగుళ్లతో ఎండిన శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మద్దికెర : రైతులు ఏడాదికి ఏడాదికి పంట మార్పిడి చేసుకోవడం వల్ల పంటలకు తెగుళ్లు రాకుండా జాగ్రత్త పడవచ్చని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్రచౌదరి, సస్య రక్షణ శాస్త్రవేత్త మౌనిక అన్నారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలో సాగైన పప్పుశనగ పంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఏటా ఒకే పంటను సాగు చేయడం ఇలాంటి తెగుళ్లు వస్తాయన్నారు. ప్రస్తుతం పప్పుశనగ పంటలో ఎండు వేరు కుళ్లు ఉధృతి అధికంగా ఉందన్నారు. తెగులు నివారణకు 2 కిలోల ట్రికోడెర్మా విరిడీ, 2 కిలోల ఐడోమోనాస్‌ను ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. ఏఓ రవి ఉన్నారు.

31వ తేదీని కాళరాత్రిగా మార్చుకోకండి

వెల్దుర్తి(కృష్ణగిరి): నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకాలంటూ మద్యం, డ్రగ్స్ మత్తులోకి చేరి ఆ రాత్రిని కాళరాత్రిగా మార్చుకోవద్దని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు పేర్కొన్నారు. యువతలో చైతన్యం కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో ప్రచార కరపత్రాలను శుక్రవారం అవిష్కరించారు. నూతన సంవత్సర వేడుకలంటూ యువత మద్యం మత్తులో అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. బలిజ శ్రీరాములు, వైద్యం రామనాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

తుగ్గలి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్ విమర్శించారు. శుక్రవారం పార్టీ మూడవ మహాసభ స్థానిక రైతు భవన్‌లో నిర్వహించారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల కన్వీనర్‌గా శ్రీరాములు, సభ్యులుగా బలరాముడు, రామాంజనేయులు, ఎంగస్వామి, బెన్నీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు : బీఆర్ అంబేడ్కర్‌పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహానంది మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని కలుగొట్ల, రామళ్లకోట, వెల్దుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో నాలుగు గంటల పాటు అంతరాయం ఉంటుందని లైన్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయ, శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి సంబంధించి త్రీఫేస్ విద్యుత్‌ను తెల్లవారుజామున 5 నుంచి 9 గంటలకు వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 13న రామళ్లకోట గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ టీఎం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 13న రాత్రి మాదిగ ప్రసాద్, అనిల్ ఇద్దరూ కలిసి దిగువపేట కాలనీలో వెళ్తుండగా కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషించి దాడి చేశారని, ఈ విషయంపై ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికైనా నిందితులపై కేసు నమోదు చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గిడ్డయ్య మాదిగ, మద్దిలేటి మాదిగ ఉన్నారు.

రైల్వే పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి/ఆలూరు: మండలంలోని చాకిబండ గ్రామంలో శుక్రవారం ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పర్యటించారు. గ్రామంలోని శ్మశానంలో జరుగుతున్న రైల్వే పనులను పరిశీలించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ ఓబులపతి, నాయకులు లింగప్ప, గ్రామస్తులు ఉన్నారు.

చార్జీలతో బాదుతున్న ప్రభుత్వం


పత్తికొండలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు.. దానికి విరుద్ధంగా ఆర్నెళ్లలోపే రూ.20వేల కోట్ల భారాన్ని మోపి ప్రజలను మోసం చేశారని సీపీఎం పత్తికొండ మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి, సీఐటీయూ నాయకులు గోపాల్ ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పట్టణంలోని చక్రాల్ల రోడ్డులో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపడం సరి కాదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కరెంటు బిల్లులను దహనం చేశారు. స్థానిక పాతపేటలోని కొండగేరి, చాకలి వీధిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఐదు రోజులకోసారి నీళ్లు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నీటి సమస్య తీర్చాలని వారు డిమాండ్ చేశారు.

వైభవంగా దుర్గమ్మ బోనాల ఊరేగింపు


ఊరేగింపు ముందు కలశాలతో చిన్నారులు

మద్దికెర : మండల కేంద్రంలో భవానీ మాలధారులు దుర్గమాతకు శుక్రవారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. 41 రోజుల పాటు దీక్ష చేసి దుర్గమ్మ దర్శనానికి వెళ్లేముందు అమ్మవారి ఊరేగింపు నిర్వహించడం అనవాయితీ అని గురుస్వాములు శ్రీనివాసులు తెలిపారు. ముందుగా స్థానిక మద్దమాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి చిన్నారులు కలశాలతో ముందు నడవగా.. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ, భజన పాటలకు మాలధారులు నృత్యాలు చేసుకుంటూ పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో అమ్మవారి భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఘనంగా కుంభోత్సవం


కుంభాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

హొళగుంద: మండలంలోని వందవాగిలి గ్రామంలో వెలిసిన కొల్లాపురమ్మ దేవికి కుంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా గ్రామ సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద గంగ పూజతో పాటు ఇతర ప్రత్యేక పూజల అనంతరం భక్తులు కుంభాలను గ్రామ వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో దేవికి ఆకుపూజ, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు జరిగాయి. గ్రామస్తులు అమ్మవారికి పిండి వంటలను నివేదించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

తగాదాలతో భూ సమస్యలు పరిష్కారం కావు


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్

తుగ్గలి : తగాదాలతో భూ సమస్యలు పరిష్కారం కావని తహసీల్దార్ రమాదేవి అన్నారు. రెవెన్యూ సదస్సులో భాగంగా శుక్రవారం జొన్నగిరిలో గ్రామసభ నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 15వినతులు స్వీకరించారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు కాశీరంగస్వామి, అనంతస్వరూప్ పాల్గొన్నారు.

కృష్ణగిరి: భూ సమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి నూకరాజు కోరారు. ఆలంకొండ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలహర్వి: రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యలపై విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని హర్దగేరి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పౌష్టికాహారాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. తహసీల్దార్ నజ్మాబాను, ఆర్‌ఐ మహేష్, మండల సర్వేయర్ మంజుభార్గవి, సర్పంచ్ గురుదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

హొళగుంద: గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు స్థలం కేటాయించాలని సమ్మతగేరి గ్రామస్తులు తాలూకా స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్, తహసీల్దారు సతీష్‌ను కోరారు. శుక్రవారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సతీష్ తెలిపారు.

ఆస్పరి: హలిగేర గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ రైతులు తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు దరఖాస్తులు అందజేశారు.

ఆలూరు రూరల్: ముద్దనగేరి గ్రామంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 17 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు.

సంక్షేమ పథకాల అమలులో సర్కారు విఫలం



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న దృశ్యం

- వెల్దుర్తిలో పార్టీ కార్యాలయం ప్రారంభం
- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. మండల కేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, జగనన్న కన్నా మరింత మెరుగైన సంక్షేమం అందజేస్తామని ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి సీఎం చంద్రబాబు మరోసారి తన నైజాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం అంటూ జనాన్ని మోసం చేశారన్నారు. ప్రజలపై మరింత భారాన్ని మోపుతూ విద్యుత్ చార్జీలను భారీగా పెంచారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా అన్నదాతను ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయాన్ని పండుగలా చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాల్సి ఉండగా.. రైతన్నను గాలికొదిలేశారన్నారు. హామీలు అమలు చేయకపోగా ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో కూటమి నాయకుల బెదిరింపులకు భయపడవద్దని, పార్టీ అందరికీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం వ్యతిరేకతను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం మాజీ సీఎం జగనన్న పుట్టినరోజు సందర్భంగా ముందస్తుగా వేడుకలు జరుపుకున్నారు. నూతన కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కంగాటి రామ్మోహన్‌రెడ్డి, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల ఎంపీపీలు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, రంగన్న, జెడ్పీటీసీ సుంకన్న, మండల కన్వీనర్లు రవిరెడ్డి, ఆర్‌బీ వెంకటరాముడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్ కుమార్ రెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ, నాయకులు శ్రీరాంరెడ్డి, శరభారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాధవరావు, రంగనాయకులు, భీమిరెడ్డి, ఎర్ర కృష్ణారెడ్డి, మాధవస్వామి, సీతారాముడు, కేశవయ్య, ప్రహ్లాద, మల్లికార్జున, బాలు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం జగనన్న జన్మదిన వేడుకలు..

వెల్దుర్తిలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. కార్యక్రమానికి కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోరాటాలతో సమస్యలు పరిష్కారం

దేవనకొండ: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారామవుతాయని సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏఐవైఎఫ్ 9వ మండల మహాసభను మండలాధ్యక్షుడు ఎం.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రవికుమార్, రామాంజి, పరమేష్, నరేష్, మద్దిలేటి పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా అశోక్, నరేష్, రమేష్, కార్యదర్శిగా బి.రవికుమార్, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, భాస్కర్, మహబూబ్‌బాషా, కోశాధికారిగా ఎం.పరమేష్‌లతో పాటు 21 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రజలు కలిసి మెలసి జీవించాలి

హాలహర్వి: గ్రామాల్లోని ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని ఆలూరు సీఐ వెంకటచలపతి సూచించారు. మండలంలోని నిట్రవట్టి గ్రామంలో శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రతో కలిసి పాల్గొన్నారు. గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. కర్ణాటక సరిహద్దు ఉండటం వల్ల కర్ణాటక మద్యం సరఫరా అయ్యే అవకాశం ఉందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. పిల్లలను బాగా చదివించుకోవడం, వ్యవసాయంలో రాణించడంలో పోటీ పడాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని కోరారు.

27న లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

మద్దికెర : స్థానిక మద్దమాంబ దేవాలయంలో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు లోక కల్యాణార్థం కసాపురం లక్ష్మీనారాయణ స్వామి శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తలారి పరుశురాముడు శుక్రవారం తెలిపారు. రథయాత్ర ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక శిబిరాలకు స్పందన కరువు


వెల్దుర్తిలో ప్రత్యేక శిబిరంలో ప్రజల కోసం ఎదురుచూస్తున్న ఎంపీడీఓ సుహాసినమ్మ

వెల్దుర్తి(కృష్ణగిరి): కూటమి ప్రభుత్వంలో చేపట్టే కార్యక్రమాలన్నీ తుస్సుమంటున్నాయి. ప్రభుత్వం అమలు చేయాల్సిన కార్యక్రమాలను అధికారులు తూచ తప్పకుండా పాటించాల్సిందే. అయితే ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా ప్రతి మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు శ్రీకారం చుట్టారు. కానీ ఈ కార్యక్రమం ప్రారంభించి రెండు రోజులు గుడుస్తున్నా సమస్యలపై ఒక్కరు కూడా అర్జీలు ఇవ్వడానికి రాలేదంటే ప్రభుత్వ కార్యక్రమాలు ఏవిధంగా సాగుతున్నాయో అర్థమవుతుంది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ సుపరిపాలన వారోత్సవాలు నిరాదరణకు గురవుతున్నాయి. గ్రామాల్లో ప్రజలకు విషయం తెలియకపోవడమో లేకా అర్జీలు ఇస్తే సమస్యలు పరిష్కారం కావమోననే భావనతో ఎవ్వరు రావడం లేదు. రెండు రోజులుగా ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈఓఆర్డీ రవికిశోర్ ప్రజల నుంచి ఏమైనా అర్జీలు వస్తాయా అని కళ్లు కాయలు కాసేలా ఎదుచూశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అలాగే కృష్ణగిరి మండలంలో కూడా ఎవరూ రాకపోవడంతో మీసేవ, సచివాలయాలకు పనులపై వచ్చే వారిని పిలుచుకుని అర్జీలు ఇచ్చినట్లు ఫొటోలు తీసుకుని ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిసింది.

వైఎస్ విగ్రహం మరమ్మతులకు అడ్డంకులు


పోలీసులు అడ్డుకోవడంతో ఆలూరులో నిలిచిపోయిన వైఎస్సార్ విగ్రహ మరమ్మతులు

ఆలూరు రూరల్: మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం మరమ్మతులను అడ్డుకోవడం సమంజసం కాదని, కూటమి నేత మాటలకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. శుక్రవారం ఆలూరులో వైఎస్ విగ్రహానికి మరమ్మతులు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడం భావ్యం కాదన్నారు. ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ.. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 2013లో పంచాతీ తీర్మానం చేసి ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని మూడేళ్ల క్రితం హైవే 167 నిర్మాణంలో భాగంగా పక్కన పెట్టారన్నారు. కాగా శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టగా..విగ్రహం ఏర్పాటుకు మరోసారి పంచాయతీ తీర్మానం,ఎంపీడీఓ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ వారితో అనుమతి తీసుకోవాలని వైఎస్సార్ నాయకులను పోలీసులు హెచ్చరించడం దారుణమన్నారు. గతంలో పంచాయతీ తీర్మానం చేసి విగ్రహం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. విగ్రహం ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడం వెనుక కూటమి నేతల కుట్ర ఉందని మండిపడ్డారు.